క్లుప్తంగా

కాల్వకు మరమ్మతులు చేయించాలి

శావల్యాపురం : మండలంలోని మతుకుమల్లి గ్రామ సమీపంలోని కారుమంచి మేజరు కాల్వ (ఏబీసీ 18/3) మైలురాయి వద్ద డీపీ కెనాల్ శిథిలావస్థకు చేరింది. రైతులు సాగు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు మాజీ సర్పంచ్ ముంద్రు హనుమంతరావు తెలిపారు. కెనాల్‌ను రైతులతో కలిసి ఎన్నెస్పీ ఏఈ పోట్లూరి లక్ష్మీనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ జిల్లా కలెక్టరు దృష్టికి సమస్యలను తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు సమస్య ఉన్న ప్రాంతాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి



శావల్యాపురం : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని మండల బీజేపీ నాయకులు గట్టుపల్లి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని వేల్పూరు, వెలమవారిపాలెం గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరు కనీసం రెండు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ చేపట్టకపోతే మానవ మనుగడకు పెనుప్రమాదం పొంచి ఉందని తెలిపారు. నేటి వాతావరణ మార్పులకు కారణాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వట్టెం శివాజీ, రాంపల్లి హనుమంతరావు, సుబ్బారావు, పోక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో గుర్తింపు




వినుకొండ(నూజెండ్ల): స్థానిక మున్సిపాలిటీలో 30 సంవత్సరాలుగా స్వీపర్‌గా సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన నూనె నాగయ్యను మున్సిపల్ అధికారులు, సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి మాట్లాడుతూ నాగయ్య వృత్తిపట్ల అంకితభావంతో పనిచేస్తూ అందరి మన్ననలు పొందారన్నారు. యూనియన్ లీడర్‌గా కూడా పనిచేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి, మేనేజర్ శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, సిబ్బంది, సీపీఐ నాయకులు సండ్రపాటి సైదా, బూదాల శ్రీను పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



నరసరావుపేట ఈస్ట్: కోటప్పకొండరోడ్డు శ్రీనివాసనగర్‌లోని శ్రీగోదా పద్మావతి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఉదయం స్వామి, అమ్మవార్ల మూలవిరాట్ ల కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించా రు. ఆలయ ఆవరణలో హోమం అనంతరం పూర్ణాహుతి సమర్పించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు స్నపన తిరు మంజనం, చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం ద్వాదశ ఆరాధన, పుష్పయాగం తర్వాత భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు



నరసరావుపేట: పారిశుద్ధ్యం మెరుగుకు తగిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం తొమ్మిదో వార్డు శ్రీనివాసనగర్ పరిసర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. అక్కడ నిర్వహిస్తున్న స్పెషల్ శానిటేషన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డుల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న మురుగు కాల్వలలో పూర్తిస్థాయిలో పూడిక తీయాల్సిందిగా అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. పిచ్చి మొక్కలు, చెట్లను తొలగించాలని పేర్కొన్నారు. సంబంధిత స్థల యజమానులకు ఖాళీ ప్రదేశాల్లో పిచ్చి మొక్కలు, చెట్లను తొలగించుకోవాలని నోటీసు ఇవ్వాలని సూచించారు. తొమ్మిదో వార్డు మాజీ కౌన్సిలర్ వాసిరెడ్డి రవి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రామకోటయ్య, క్రాంతికుమార్, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఖరీఫ్ పనుల్లో అన్నదాతలు

- రెండు రోజులుగా పత్తి విత్తనాలు నాటే పనులు ముమ్మరం
- రైతు భరోసా త్వరగా ఇవ్వాలని కోరుతున్న అన్నదాతలు



గణపవరంలో పత్తి విత్తనాలు నాటుతున్న వ్యవసాయ కూలీలు

నాదెండ్ల : ఖరీఫ్ వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న తేలికపాటి వర్షాలకు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వేసవి దుక్కులు దున్నుకుని పొలాలను సిద్ధం చేశారు. విత్తనాలను నాటేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. పొలాల్లో అచ్చులు తోలి ఆదివారం విత్తనాలు నాటారు. మరికొన్నిచోట్ల వర్షం పదును చాలకపోవటంతో మరో రెండు రోజులు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. దుక్కులు దున్నే ముందు పొలంలో పశువుల ఎరువు గానీ, గొర్రెలు, మేకల ఎరువు వేసి మట్టిని వెదజల్లి నేలను కలియదున్నారు. దీంతో భూమిలో పోషకాలు నిల్వ చేసుకునే శక్తి పెరుగుతుంది. దీని వల్ల పంటలకు నష్టం కల్గించే చీడపీడలు నాశనం అవుతాయి. వేసవిలో దుక్కులు దున్నుకోవటం వల్ల కలుపు విత్తనాలు, నిద్రావస్థలో ఉన్న పురుగులు, వివిధ రకాల తెగుళ్లు, శిలీంధ్ర జాతులు అధిక వేడికి నాశనం అవుతాయి .

పెరిగిన కౌలు ధరలు...

నాదెండ్ల మండలంలో 25 వేల ఎకరాల సాగు భూమి ఉంది. గతేడాది మండలంలో పత్తి 5,900 ఎకరాల్లో సాగైంది. మిర్చి 4,400, పొగాకు 350, శనగ వెయ్యి ఎకరాల్లో వేశారు. చివర్లో మిచాంగ్ తుపాను కారణంగా కొంత పంటనష్టం జరిగింది. అయితే పత్తి, మిర్చి పంటల్లో అధిక ఖర్చులు అవుతుండగా, మార్కెట్లో వాటి ధరలు సైతం ఆశించిన విధంగానే ఉన్నాయి. మిచాంగ్ తుపాను ప్రభావం తర్వాత పత్తి, మిర్చి తొలగించిన రైతులు పొగాకు సాగుకు మొగ్గు చూపారు. ఈ ఏడాది బహిరంగ మార్కెట్లో పొగాకు క్వింటా ధర రూ.15–16 వేలు పలకడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమైంది. పత్తి క్వింటా రూ.8 వేల వరకూ ధర పలుకుతోంది. ఇదే అదనుగా భూ యజమానులు కౌలు ధరలను పెంచేశారు.



నాదెండ్లలో పత్తి విత్తనాలు నాటేందుకు అచ్చు తోలుతున్న రైతు

ఆగస్టు వరకు ఖరీఫ్ సాగు చేసుకోవచ్చు

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఖరీఫ్ సీజన్ పనులు ప్రారంభమయ్యాయి. రైతులు దుక్కులు దున్ని అచ్చుతోలి విత్తనాలు నాటుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో తగిన తేమ శాతం లేకపోవటంతో పొలాలను సిద్ధం చేసుకున్నారు. ఆగస్టు వరకు ఖరీఫ్ సీజన్ పంటల సాగు చేసుకోవచ్చు. ఇప్పటికే రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ఖరీఫ్ ప్రారంభం కాగానే రైతులు ఈక్రాప్ నమోదు చేసుకుంటే ఆర్‌బీకేల ద్వారా పంట ఉత్పత్తులు కొనుగోలు చేసే అవకాశం ఉంది. సెప్టెంబర్ నుంచి ఈ క్రాప్ నమోదు ప్రారంభిస్తాం.

– ఎ హరిప్రసాద్, మండల వ్యవసాయాధికారి

పెట్టుబడి సాయం త్వరగా ఇవ్వాలి



గత ప్రభుత్వ హయాంలో ఖరీఫ్ ఆరంభంలోనే రైతు భరోసా బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ నగదు జమయింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన మొత్తం అందలేదు. నాకు నాలుగెకరాల భూమి ఉంది. మరో ఐదెకరాలు కౌలుకు తీసుకుని మిర్చి, శనగ సాగు చేస్తున్నాను. త్వరలో ఈ ప్రభుత్వం కూడా పెంచిన రైతు భరోసా నగదును బ్యాంకు ఖాతాలకు జమ చేస్తే బాగుంటుంది.

– చిన్నపరెడ్డి, రైతు, తూబాడు గ్రామం

కృష్ణవేణి కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు

నరసరావుపేట ఈస్ట్: కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరం నుంచి ఎంబీఏ, ఎంసీఏ కోర్సులలో ప్రవేశాలు కల్పించేందుకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) నుంచి అనుమతి లభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలగా ఈ విద్యా సంవత్సరం నుంచి ఎంబీఏలో 60 , ఎంసీఏ కోర్సులో 60 సీట్లు భర్తీ చేసుకునేందుకు అనుమతి లభించిందని వివరించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఎంబీఏ కోర్సుతో బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ తదితర రంగాలలో, అలాగే ఎంసీఏ కోర్సుతో సాఫ్ట్‌వేర్, ఐటీ రంగాలలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఐసెట్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులతో కౌన్సెలింగ్ ద్వారా సీట్లు భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ డి.యోగేశ్వరరావు, వై.శ్రీకాంత్, ఏ కోటేశ్వరరావు, కె.బాజీ తదితరులు పాల్గొన్నారు.



పీజీ కోర్సుల అనుమతి పత్రాన్ని చూపుతున్న కళాశాల ప్రిన్సిపల్ నాతాని

ఆసుపత్రిలోని లబ్ధిదారుకు పింఛన్ అందజేత



బొల్లాపల్లి : మండలంలోని అయ్యన్నపాలెం గ్రామ సచివాలయ సిబ్బంది సాంబశివుడు నాయక్, రామకృష్ణలు సచివాలయం పరిధిలోని పొట్లపల్లి నాగలక్ష్మమ్మకు ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేశారు. నాగలక్ష్మమ్మ కాలు ఎముక ఇరగడం వల్ల పిడుగురాళ్లలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న సిబ్బంది నేరుగా ఆసుపత్రికి వెళ్లి పింఛన్‌ను పంపిణీ చేశారు.

98.24 శాతం పింఛన్ల పంపిణీ

నాదెండ్ల: మండలంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్లు రెండోరోజు మంగళవారం సాయంత్రం 5 గంటల సమయానికి 98.24 శాతం పంపిణీ జరిగింది. సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు నగదు పంపిణీ చేశారు. మండల పరిధిలో 9,474 మందికి రూ.6.43కోట్ల మొత్తం అందజేసినట్లు అధికారులు తెలిపారు.

కౌలు రైతులకు అవగాహన సదస్సు

నరసరావుపేట రూరల్: మండలంలోని గోనెపూడిలో మంగళవారం కౌలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఈవో కె.బ్రహ్మయ్య, వీఆర్‌ఓ సాంబశివరావులు ఈ సందర్భంగా కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రం(సీసీఆర్‌సీ)పై అవగాహన కల్పించారు. కౌలు రైతులు గ్రామంలోని వ్యవసాయ సహాయకుడు, గ్రామ రెవెన్యూ అధికారి వద్ద సీసీఆర్‌సీ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రెవెన్యూ, వ్యవసాయ అధికారులు విచారణ జరిపి అర్హులైన వారికి కార్డులు మంజూరు చేస్తారని తెలిపారు. సీసీఆర్‌సీ కార్డులు కలిగిన రైతులు ప్రభుత్వం అందించే పథకాలను పొందే అవకాశం ఉందన్నారు. పంటలకు బీమాతో పాటు ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు నష్టపరిహారం ప్రభుత్వం నుంచి అందుతుందని వివరించారు. బ్యాంక్‌ల నుంచి రుణాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ సాయినాథ్, ఎంపీఈవో ఎస్‌కే మస్తాన్‌వలి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



కౌలు రైతుకు కార్డు అందజేస్తున్న ఏఈవో బ్రహ్మయ్య, వీఆర్‌వో సాంబశివరావు

సేంద్రియ ఎరువులతో భూసారాన్ని పెంచుకోవచ్చు

ఏవో బోయపాటి బ్రహ్మారెడ్డి

రెంటచింతల: సేంద్రియ ఎరువులైన పచ్చిరొట్ట పంటలు పిల్లిపెసర, జీలుగ, జనుము వేసి భూమిలో కలియదున్ని రైతులు భూసారాన్ని పెంచుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సహాయకుల కోసం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పలు రకాల పంటలను సాగు చేసే సమయంలో జీవన ఎరువుల వాడకం వలన ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని అవగాహన కల్పించాలన్నారు. సాగు చేస్తున్న పంటలకు జీవన ఎరువుల వినియోగం వల్ల 20 శాతం వరకు ఖర్చు తగ్గుతుందని రైతులకు వివరించాలని సూచించారు. రసాయన ఎరువులను అధికంగా వాడకం వల్ల భూమిలో సేంద్రియ కర్బనం తగ్గుతుందని, దీంతో పొలంలో భూ సాంద్రత గణనీయంగా తగ్గి దిగుబడి తగ్గిపోతుందని రైతులకు వివరించాలన్నారు. సాగు భూమిలో సూక్ష్మ పోషకాలైన మెగ్నీషియం, జింక్, ఇనుము, కాల్షియం లోపాలు ఉన్నా వాటిని పరిష్కరించుకోవడానికి మెగ్నీషియం సల్ఫేట్, జింక్ సల్ఫేట్ మూడు, నాలుగు సార్లు పిచికారీ చేసుకోవాలని తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారుల సూచనలతో పంటలను సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. వివిధ రకాల తెగుళ్ల, పురుగుల బారి నుంచి తట్టుకునే వంగడాలు, పంట మార్పిడి, యాజమాన్య పద్ధతులను అమలు చేసినప్పుడే అధిక దిగుబడులను సాధించవచ్చని రైతులలో చైతన్యం తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి ఫ్యాన్లు, వంటసామగ్రి

బొల్లాపల్లి: మండలంలోని పేరూరుపాడు గ్రామంలో ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ సెంటర్‌కు యంగ్ స్టార్స్ హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెనుమాల వెంకటేశ్వర్లు, కాసరగడ్డ గోవిందరాజులు ఫ్యాన్లు, చాపలు, వంట సామగ్రిని అందజేశారు. గ్రామపెద్దల సహాయసహకారాలు అంగన్‌వాడీ కేంద్రాలకు ఉండాలని సూపర్‌వైజర్ ఆర్. పద్మజారాణి అన్నారు. కార్యక్రమంలో అనపర్తి శ్రీనివాసరెడ్డి, గంగినేని రమణయ్య, రాచపల్లి ఏడుకొండలు, పిట్టల చిన్నగోవిందు, కాట్ల గురునాథం,నరసింహారావు, ఫ్రాన్సిస్, ఆళ్ల పెద్దకోటయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పి.కుమారి, ఆయా అంజమ్మ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

రెంటచింతల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతను ఇస్తుందని మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక రేగులమాణ్యం కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల(గిరిజన సంక్షేమ శాఖ)లో చదువుకుంటున్న 34 మంది విద్యార్థులకు ఆయన హెచ్‌ఎం కె.రమేష్, టీడీపీ నాయకులతో కలిసి స్టూడెంట్ కిట్స్‌ను పంపిణీ చేసి మాట్లాడారు. విలువలు, క్రమశిక్షణతో కూడిన విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రభుత్వం అన్ని వసతులతో పాఠశాలలను ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు సీహెచ్ అబ్బిరెడ్డి, నాయకులు బొడపాటి రామకృష్ణ, మూలి రాజారెడ్డి, మర్రి రాజ్‌కుమార్, మున్నా ప్రభురాజు, పాశం గోపయ్య, షేక్ బుజ్జి, హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.



గిరిజన అభ్యర్థులకు ఉచిత శిక్షణకు వినతి



విష్ణునాయక్

వినుకొండ(నూజెండ్ల): గిరిజన అభ్యర్థులకు డీఎస్సీ, టెట్ లకు ప్రభుత్వం ఉచితంగా కోచింగ్ ఇవ్వాలని ట్రైబల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు మూడావతు విష్ణునాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిని కలసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఆయన మాట్లాడు తూ ఏజెన్సీ, గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన అభ్యర్థులకు ఐటీడీఏ, ఏజెన్సీల ద్వారా కోచింగ్ అవకాశం కల్పిస్తే మేలు జరుగుతుందని తెలిపారు.

6 నుంచి వారాహీదేవి నవరాత్రులు

సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీ త్రిశక్తి దుర్గా పీఠంలో వేంచేసిన శ్రీ దుర్గా మాతని వారాహీ దేవిగా అలంకరించి ఈ నెల 6 నుంచి 15 వరకు నవరాత్రులు నిర్వహిస్తామని పీఠాధిపతి వెలిదండ్ల హనుమత్ స్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి రోజూ వారాహీ మాతకి లలితా సహస్ర నామ స్తోత్రం, వారాహీ అష్టోత్తర శత నామాలు, అమ్మవారి ద్వాదశ నామాలు, మూల మంత్రం, గాయత్రి మంత్రంతో కుంకుమార్చన ఉంటాయని తెలిపారు. ప్రత్యేక నైవేద్యాలు, మంత్ర పుష్పం, హారతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. తొమ్మిది రోజులు పాల్గొనే భక్తులకు శ్రీచక్ర మేరువ (ఒక్కొక్కరికి ఒక్కోటి) ఇచ్చి కుంకుమ పూజలు జరిపిస్తామని వెల్లడించారు. భక్తులు హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని తెలిపారు.

ఉచిత పశువైద్య శిబిరం



పశువులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

రొంపిచర్ల: మండలంలోని కొనకంచివారిపాలెం గ్రామంలో సంగం డైరీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు ఉమామహేశ్వరరావు, ఆంజనేయులు సేవలు అందించారు. వంద గేదెలకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. లేగ దూడల నట్టల నివారణకు మందులు వేశారు. పశువుల్లో వచ్చే వ్యాధుల పట్ల రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాలకేంద్రం అధ్యక్షుడు పానుగోటి శివానందం, పానుగోటి వెంకటేశ్వర్లు, గరికపాటి తాతయ్య, పాపారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అతిసారతో చిన్నారుల ప్రాణాలకు ముప్పు

శావల్యాపురం : ఐదేళ్లలోపు చిన్నారుల్లో డయేరియా (అతిసార వ్యాధి) ప్రమాదకరమని మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి రావిపూడి రమ్య అన్నారు. మంగళవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో అతిసార వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీరు కలుషితం అయితే ఈ వ్యాధి ప్రబలుతుందన్నారు. మరీ ముఖ్యంగా చిన్నారుల ప్రాణాలకు ఈ వ్యాధి ముప్పు అని తెలిపారు. సకాలంలో వైద్యసేవలు అందకపోతే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో డయేరియా బాధితుల కోసం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, జింకు మందుబిళ్లలు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. చిన్నారుల విషయంలో పెద్దలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది పర్యవేక్షణలో కరపత్రాల పంపిణీతో పాటు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రజల్లో చైతన్యం పెంపొందించేలా చర్యలు చేపట్టామన్నారు. ఆరోగ్య శాఖ సూపర్‌వైజర్లు అలవలపాటి ఏడుకొండలు, ఉమాదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి రమ్య

కారుమంచి సొసైటీ పర్సన్ ఇన్‌చార్జిగా నరేంద్రబాబు

శావల్యాపురం: మండలంలోని కారుమంచి సొసైటీకి అధికారిక పర్సన్ ఇన్‌చార్జ్‌గా నియమితులైన నర్రా నరేంద్రబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు సొసైటీ సీఈవో వైవీ నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా నరేంద్రబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన పాలక వర్గం సభ్యులు రాజీనామా చేయటంతో ప్రభుత్వ నిబంధన మేరకు ఆరు నెలలపాటు ఈ బాధ్యతలు చేపట్టినట్లు గుర్తుచేశారు. అందరి సహకారంతో అంకిత భావంతో విధులు నిర్వహిస్తానని తెలిపారు. రైతులకు మెరుగైన సేవలు అందించి సొసైటీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. నరేంద్రబాబును మాజీ ఎంపీపీ యరమాసు కోటేశ్వరరావు, జిల్లా సొసైటీ బ్యాంకు మాజీ డైరెక్టరు గోపాలం శివయ్య, కోట హరిబాబు, సొసైటీ మాజీ చైర్మన్ బొల్లా వెంకట సాంబశివరావు, సీఈవో వైవీ నారాయణ, రైతులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



నరేంద్రబాబును సన్మానిస్తున్న గ్రామపెద్దలు

విద్యాసంస్థల బందును విజయవంతం చేయాలి

చిలకలూరిపేట: ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త విద్యాసంస్థల బందును విజయవంతం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ ఏరియా కార్యదర్శి మేకపోతుల నాగేశ్వరరావు కోరారు. విద్యావ్యవస్థలో కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ ఈ కార్యక్రమం చేపట్టామని పేర్కొన్నారు. పట్టణంలోని ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థలకు బందు నోటీసులు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల నెట్, నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ, ఎన్‌ఎస్‌యూఐ వంటి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బందుకు విద్యార్థి లోకం సంపూర్ణ మద్దతు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు తెల్లబాటి సాహిత్, కొత్తపట్నం గోపి, అన్నం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బందు నోటీసు అందజేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

ఆగిన పనులన్నీ పూర్తి చేయండి

నరసరావుపేట: నియోజకవర్గంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులన్నింటిని వెంటనే పునః ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ అతిథి గృహంలో మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులు, పంచాయతీ రాజ్ సిబ్బంది, విద్య, వక్ఫ్‌బోర్డు, ఉర్దూ అకాడమీ, ఏపీఈడబ్ల్యూఐడీసీ అధికారులతో వివిధ పనులపై సమీక్షించారు. గతంలో మాదిరిగా నిర్లక్ష్యం వహిస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. టీడీపీ ప్రభుత్వం మైనార్టీల కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని గుర్తుచేశారు. ప్రజల కోసం పనిచేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. వారికి మేలు జరిగే పథకాలను నీరుగారుస్తామంటే చూస్తూ ఊరుకోనన్నారు. వీలైనంత త్వరగా పనులను ప్రారంభించి, వేగంగా పూర్తి చేయాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి, మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, కపిలవాయ విజయ్ కుమార్, మాజీ వైస్ చైర్మన్ షేక్ మీరావలి, టీడీపీ మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా పాలనలో బ్యాంకింగ్ కీలకం

ప్రస్తుతం ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల విషయంలో బ్యాంకుల చొరవ అత్యంత కీలకమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని అన్ని బ్యాంక్‌ల మేనేజర్లతో సమీక్షించారు. రానున్న రోజుల్లో అందించే సంక్షేమ పథకాలన్నీ బ్యాంకుల ద్వారానే ప్రజలకు చేరుతాయని గుర్తుచేశారు. ప్రజలకు తగిన సదుపాయాలతో బ్యాంకింగ్ సేవలు అందించాలని కోరారు. చాలా బ్యాంకుల్లో సిబ్బంది పనితీరుపై ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. ప్రజలు లేకుంటే బ్యాంకింగ్ వ్యవస్థ లేదన్నారు. ఒక్క రోజులో పెన్షన్ డబ్బులు సచివాలయం సిబ్బందికి అందజేసినందుకు అభినందనలు తెలిపారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ